క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మహబూబాబాద్: పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు విడుదల చేయాలని టీఎస్‌పీ ఎస్‌ఈయూ రాష్ట్ర కార్యదర్శి రవి, జిల్లా అధ్యక్షుడు నాగముని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఖజానా అధికారి కార్యాలయంలో డీటీఓ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఏ ఏరియల్స్, మెడికల్, సరెండర్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలన్నారు. సప్లమెంటరీ జీతాల బిల్లులను చెల్లించాలన్నారు. 2024 మార్చి నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల గ్రాట్యుటీ పెన్షన్, సంపాదిత సెలవులను నగదుగా మార్చుకునే బిల్లులు కూడా ఈ-కుబేరులోనే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రోహిత్, రఫిక్, మురళీ, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలి

గూడూరు: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని ఎంసీపీఐ యూ జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ మండల కేంద్రంలో 30పడకల ఆస్పత్రిగా పేరుగాంచిన సీహెచ్‌సీలో సరిపడా వైద్యులు, మందులు, టెస్టు కిట్లు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఈసం రామయ్య, కటకం బుచ్చిరాములు, గుండగాని సత్తయ్య, బండారి సత్యం పాల్గొన్నారు.

నేటినుంచి పశువైద్య శిబిరాలు

డోర్నకల్: గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కోసం మంగళవారం నుంచి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల పశువైద్య అధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలు దాటిన దూడలు, ఆవులు, ఎద్దులు, గేదెలకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశాలు ఉంటాయని తెలిపారు. వచ్చే నెల 9 వరకు ప్రతీ గ్రామంలో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గార్ల: మండలంలోని పశువులకు ఈనెల 15 నుంచి నవంబర్ 14 తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు గార్ల, ముల్కనూరు పశువైద్యాధికారులు సురేష్‌కుమార్, శ్రావణ్‌కుమార్ సోమవారం తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ పరామర్శ




మహబూబాబాద్ రూరల్: తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గుడిబోయిన శ్రీనివాస్ మృతదేహాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సోమవారం సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ మృతి సంఘటన చాలా బాధాకరమని, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ వెంట బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు శ్రీరాం నాయక్, మార్నేని రఘు, గుగులోతు వనజ, కొంపెల్లి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

శ్మశానవాటిక నిర్మించాలి



మహబూబాబాద్ అర్బన్: ఈదులపూసపల్లి శ్మశానవాటిక నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మించాలని సీపీఎం నాయకులు సమ్మెట రాజమౌళి, గాని వెంకన్న కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి 1వ వార్డు కౌన్సిలర్ వెన్నం లక్ష్మారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి దుగ్గి లక్ష్మీనారాయణ, బోయిని లక్ష్మణ్, తమ్మెల్ల విజయ్, పుట్ట సర్వేశ్వర్, పల్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఒకేసారి రెండు ఉద్యోగాలు



కురవి: మండల కేంద్రం శివారు రేకుల తండా జీపీ పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన మరిపెల్లి యల్లయ్య, లచ్చమ్మ కుమారుడు సాయికుమార్ తొలి ప్రయత్నంలోనే రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ నియామకపత్రాన్ని సోమవారం తల్లిదండ్రులకు అందించాడు. డీఎస్సీలో 6వ ర్యాంకు ద్వారా పీడీ ఉద్యోగం, బీసీ సంక్షేమ గురుకులంలో పీఈటీ ఉద్యోగం సాధించాడు. కష్టపడి చదువుకుని తల్లిదండ్రుల కలను నెరవేర్చాడు.

నిలిచిన రోడ్డు పనులు

- నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక వరకు మొదలు పెట్టి వదిలేశారు..
- చిన్నపాటి వర్షానికే జలమయం అవుతున్న రహదారి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- తరచూ ప్రమాదాలు





చిన్నపాటి వర్షానికి రోడ్డు జలమయం కాగా ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మహబూబాబాద్: రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ఏడాది పూర్తి అయినా పనులు పూర్తి కాలేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోర్టు కేసులు తదితర కారణాలు రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా మారాయని అధికారులు చెబుతున్నారు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి.

మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక వరకు సుమారు కిలోమీటరు మేరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు చాలా గృహాలను కూల్చి వేశారు. కొంత మంది బాధితులు కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు నత్తనడక సాగాయి. కేవలం డివైడర్ల నిర్మాణం మాత్రమే దాదాపు పూర్తి చేశారు. డ్రెయినేజీ కొంత మేరకు చేయగా సెంట్రల్ లైటింగ్, రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. నిర్మాణ దశలో ఉండటంతో రోడ్డంతా అధ్వానంగా తయారైంది. గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలతోపాటు రోడ్డు వెళ్లే రజాలిపేట గ్రామంతోపాటు పలు గ్రామాలు, పలు కాలనీలు ప్రజలు కూడా నానా తంటాలు పడుతున్నారు.

ప్రతి కౌన్సిల్ సమావేశంలో చర్చ

మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రతి కౌన్సిల్ సమావేశంలో పత్తిపాక రోడ్డు విషయంపై చర్చ వస్తుంది. త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ తోపాటు మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు మాత్రం నిర్మాణం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కానీ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుగా ఉన్న పలు ఇళ్లు కూల్చివేయడం లేదని చెబుతున్నారు. కోర్టు కేసుల్లో ఉన్నాయని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలుపగా ఎమ్మెల్యే మాత్రం ఏది ఏమైనా వెంటనే పూర్తి చేయాలన్నారు. రోడ్డును పలుమార్లు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి పరిశీలించారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ పూజలు ప్రారంభం



అభిషేకం చేస్తున్న వేదపండితులు

గార్ల: గార్ల మండలం మర్రిగూడెం వేట వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం యజ్ఞం, పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. 4నెలల క్రితం గాలి దుమారం, ఈదురు గాలులకు ధ్వజస్తంభం పడిపోయిన విషయం విదితమే. ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా తొలిరోజు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పారాయణం చేసి యాగశాల ప్రవేశం, వేదపండితులు యజ్ఞం ప్రారంభించారు. అనంతరం నూతన ధ్వజస్తంభంకు అభిషేకం నిర్వహించారు. పూర్ణాహుతి హోమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో దాతలు ఎన్నారై డాక్టర్ పులి గోపాల్ రెడ్డి, ప్రమీలారెడ్డి దంపతులు, పుల్లఖండం రమేష్ బాబు, శ్రీనివాస్‌గుప్తా, ఉపేందర్, వేదపండితులు అచ్యుతాచార్యులు, రామాచార్యులు, ఆలయం ఈఓ సమత పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

కొత్తగూడ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని అయిలయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసుకుంటున్నారని అన్నారు. పేదలకు లబ్ధి చేకూరేలా గ్రామసభలు ఏర్పాటు చేసి పారదర్శకంగా ఎంపిక జరగాలని కోరారు. ఈ సమావేశంలో బూర్క వెంకటయ్య, శ్రీశైలం, బుచ్చిరాములు, లింగన్న, యుగేందర్, సురేందర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

మరిపెడ రూరల్: మండలంలోని ఉల్లెపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ సర్పంచ్ చిర్రబోయిన ప్రభాకర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మధుకర్, గ్రామస్తులు చలమల్ల శ్రీనివాస్‌రెడ్డి, గుండ వీరన్న, పానుగంటి దివాకర్, మోర వెంకన్న, రాసమల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీ’లు అమలు చేయాలి



మాట్లాడుతున్న సక్రు

గార్ల: ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎన్‌డీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా, గ్యారంటీలను అమలు చేయకపోవడం విచారకరం అన్నారు. నేడు జిల్లా కేంద్రంలో జరిగే ప్రదర్శనలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం మండల కార్యదర్శి వీరభద్రం, పీవైఎల్ జిల్లా కార్యదర్శి సీహెచ్ గణేశ్, సక్రు, సర్వయ్య, భద్రాద్రి, మంగయ్య, మనోహర్, మంగీలాల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



గార్ల: ఆర్థికసాయం చేస్తున్న మిత్రులు



మరిపెడ రూరల్: నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

గార్ల: గార్లలోని సినిమాహాలు బజారులో గల ఎండి ఫరీద్ ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా, గార్ల ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం అతని భార్యకు రూ.70,600 నగదును అందజేశారు. ఆర్థికసాయం చేసిన వారిలో కందునూరి శ్రీనివాసరావు, రహీఖాన్, షబ్బీర్‌ఖాన్, ఎస్‌కె యాకూబ్‌పాషా, శ్రీకాంత్, అఫ్జల్‌బేగ్, నరేష్, కిశోర్, విజయ్, జాన్‌ఖాన్, సత్తిమేస్త్రి, అక్బర్‌పాషా, సలీం, అఖిల్, రాజేందర్, సద్దాం, నాని, ఇమ్రాన్, తదితరులు ఉన్నారు.

చిన్ననాటి స్నేహితురాలికి అండగా..

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన మట్టే శైలజ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆమెతోపాటు జెడ్పీహెచ్‌ఎస్ ఎల్లంపేట పాఠశాలలో 2011-12 ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు సోమవారం మృతురాలి ఇద్దరి ఆడపిల్లల పేరు మీద రూ.30వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

ముగిసిన పూజలు, నిమజ్జనాలు



గూడూరు: నిప్పులపై నడుస్తున్న మహిళా భక్తురాలు



కేసముద్రం: కృష్ణానదిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



కొత్తగూడ: పూజలు చేస్తున్న భక్తులు

గూడూరు: మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలందుకున్న దుర్గాదేవి మండపం వద్ద సోమవారం హోమగుండం పూజను మాలధారుడు హరీశ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి నిమజ్జనానికి ముందు మండపం ఎదుట నిప్పులగుండం పూజ చేశారు. హోమగుండంలో మాలధారులు, కంకణధారులు, మహిళలు నిప్పులపై నడవడంపై స్థానికులు భక్తితో జై దుర్గాభవాని అంటూ వేడుకున్నారు. స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో, దుర్గాబేకరీ ఆధ్వర్యంలో సోమవారం దుర్గామాత విగ్రహాల శోభాయాత్ర చేపట్టి, సమీప పాకాలవాగులో నిమజ్జనం చేశారు.

దుర్గమ్మకు సామూహిక హోమాలు

కొత్తగూడ: మండలంలోని వేలుబెల్లిలోని కోదండ రామాలయంలో నెలకొల్పిన దుర్గమ్మ వద్ద సోమవారం గ్రామస్తులు సామూహిక హోమాలను నిర్వహించారు. మాజీ సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి-సురేందర్, ఆలయ కమిటీ చైర్మన్ పబ్బ శ్రీనివాస్-సృజన దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. అమ్మవారి లడ్డును డ్రా తీయగా మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన బోయిన ప్రణీత గెలుచుకున్నారు.

విజయవాడలో నిమజ్జనం

కేసముద్రం: మండల కేంద్రంలోని ఆర్యవైశ్యభవన్‌లో శ్రీమాత వెల్ఫేర్ సహకారంతో, వాసవీ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని సోమవారం విజయవాడలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో చిల్లంచర్ల సతీష్, వోమ సంతోష్, మాలె రవి, తౌనుపునూరి భాస్కర్, రామడుగు ధర్మాచారి, బోగోజు వేణుగోపాలచారి, బోగోజు నాగేశ్వరాచారి, సాగర్ పాల్గొన్నారు.

నేటినుంచి ప్రైవేట్ కళాశాలల బంద్



మాట్లాడుతున్న సత్యనారాయణ

మహబూబాబాద్ అర్బన్: నేటినుంచి మూడు రోజులపాటుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ ప్రకటిస్తున్నట్లు ప్రైవేట్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకుడు జోలి సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం అసోసియేషన్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. కాలేజీలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే వరకు కళాశాలలో బంద్ చేస్తామన్నారు. మూడేళ్లగా బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో కళాశాలలు నిర్వహించే స్థితిలో లేమన్నారు. అధ్యాపకులకు జీతాలు చెల్లించే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కృష్ణ ప్రసాద్, వీరన్న, సూర్య ప్రకాశ్, రాకేశ్, సాయికుమార్, వెంకటేశ్, మహేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర సమ్మేళనం జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: ఖమ్మం జిల్లాలో నవంబర్ 5, 6 తేదీల్లో జరిగే గిరిజన సంఘం రాష్ట్ర సమ్మేళనంను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి భూక్య హరినాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సమ్మేళనం కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, గుగులోత్ కిషన్‌నాయక్, సీతారాంనాయక్, కేలోత్ సాయికుమార్, పార్వతి, మోతీలాల్ పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

తొర్రూరు: దేశంలో 14 రాష్ట్రాల్లో బలమైన నిర్మాణం కలిగి కార్మికవర్గం హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ)లో ఐఎఫ్‌టీయూను విలీనం చేసే అక్టోబర్ 20న నిర్వహించే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం తొర్రూరులో రిక్షా ఎగుమతి హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు, కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పాడిన బీకు, వడ్లకొండ లక్ష్మయ్య, శ్రీను, వెంకటయ్య, రాజు, మహేష్, వెంకన్న రాము, రమేశ్, మహేందర్ పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురిపై కేసు

ఖానాపురం: మండలంలోని మనుబోతులగడ్డ శివారులో పేకాడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మనుబోతులగడ్డ శివారులో పేకాడుతున్నారనే సమాచారం అందడంతో పోలీసు సిబ్బంది దాడి చేశామన్నారు. మనుబోతులగడ్డకు చెందిన గుర్రం సదయ్య, వల్లెపు చంద్రయ్య, బీసు రవి, ఎస్‌కే.జాఫర్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.7,650 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తవ్వారు.. వదిలేశారు..



తవ్వకాలతో పైపులు పగిలి వృథాగా పోతున్న నీరు



యాదవనగర్ మార్గంలో ప్రమాదకరంగా గుంతలు

డోర్నకల్: స్థానిక జెడ్పీ స్కూల్ సెంటర్ నుంచి సాయినగర్, యాదవగనర్ మీదుగా బైపాస్ రోడ్డు వరకు రోడ్డు పక్కన తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. ప్రైవేట్ నెట్‌వర్క్ సంస్థ కేబుల్ ఏర్పాటు కోసం కొన్ని రోజుల క్రితం రోడ్డు పక్కన కూలీలతో తవ్వకాలు చేపట్టారు. తవ్వకాల పనులు పూర్తై పది రోజులు దాటినా నేటికీ గుంతలను పూడ్చలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బైపాస్ రోడ్డు నుంచి యాదవనగర్‌కు వెళ్లే మార్గంలో రాత్రివేళ వాహనదారులు గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. మరోవైపు గుంతల తవ్వకాలతో బైపాస్ రోడ్డు నుంచి సాయినగర్ నాలుగో వీధి వరకు భూమిలోపల ఉన్న తాగునీటి పైపులు ఏడు ప్రాంతాల్లో ధ్వంసమయ్యాయి. పెద్ద చెరువులోని బోరుబావి నుంచి మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని ఓవర్‌హెడ్ ట్యాంకు వరకు భూమిలో ఏర్పాటు చేసిన పైపులైను ఏడు ప్రాంతాల్లో ధ్వంసమైంది. పైపులు పగిలి పది రోజులవుతున్నా సంబంధిత కాంట్రాక్టర్, మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి, పగిలిన పైపులకు వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెరుమాండ్ల రాహుల్ (25) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో అద్దెకు ఉంటూ ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండుగకు ఇంటికి వచ్చి ఆదివారం సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లాడు. గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లు తెలిపారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బోర్‌వెల్ వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

తొర్రూరు: బోర్‌వెల్ వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన సోమవారం డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ శివారు జీడిమెట్లకు చెందిన కోన వరుణ్(22) ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. మహబూబాబాద్‌లో వ్యక్తిగత పని నిమిత్తం స్నేహితుడు సాయి సూర్యవర్ధన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో బోర్‌వెల్ వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వరుణ్ తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితుడు సాయి సూర్యవర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి బాబాయి రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సాయిబాబా మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ప్రొఫెసర్ సాయిబాబా మృతి విప్లవోద్యమానికి తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ అధ్యక్షుడు కళ్లెం వీరారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటం వద్ద సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో సోమ గోవర్ధన్, ఉపేందర్‌రెడ్డి, కొమిరె ఉప్పలయ్య, సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, గుంజె హన్మంతు, దుడ్డెల రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు. దేశం సాయిబాబా వంటి విప్లవ మేధావిని కోల్పోయిందని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ బీమానాయక్, గుగులోత్ కిషన్ అన్నారు. సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ(ఎంఎల్) మొగిలిప్రతాప్‌రెడ్డి ఆరోపించారు.

శీతల పానియాల పంపిణీ

గార్ల: మండలంలోని ముల్కనూరు గ్రామంలో ఎస్‌హెచ్‌ఈపీఏఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ మహబూబాబాద్ ఫ్లడ్ రిలీఫ్ సెంటర్ సీఈఓ ఆర్.సురేష్ సహకారంతో శీతల పానియాలను సోమవారం పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట్‌లాల్, జనార్దన్, హాకీం, సతీష్, మదార్, వెంకన్న, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు జీవాల మృతి



మృతి చెందిన జీవాల వద్ద రోదిస్తున్న బాధితులు

మహబూబాబాద్ రూరల్: పిడుగుపాటుకు మూడు జీవాలు మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని బలరాంతండాలో సోమవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన పెద్దపులి ఫకీరా తన ఎద్దు, ఆవు, దూడను స్థానిక షెడ్డు ఆవరణలోని గడ్డివాము సమీపంలో గల చెట్టుకు కట్టి ఉంచాడు. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వర్షం కురిసి, పిడుగులు పడ్డాయి. దీంతో మూడు జీవాలు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. రూ.1.50లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు విలపించారు.